www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం జులై 25 2024

పెద్దిరెడ్డి ఎమ్మెల్యే పదవికి ఎసరు..?

- హైకోర్టులో బిగిసుకున్న అనర్హత కేసు
- 142 ఆస్తులను అఫడవిట్‌లో చూపకుండా దాచిన పెద్దిరెడ్డి
- పూర్తి సాక్ష్యాధారాలతో హైకోర్టులో రామచంద్ర యాదవ్ పిటిషన్..
- మదనపల్లె రికార్డుల దహనం వెనుక కారణం ఈ కేసే..?

పుంగనూరు రికార్డుల గది బయట పోలీసుల కాపల

ప్రజాశక్తి- పుంగనూరు: ఈ పిటిషన్ వేసిన రామచంద్ర యాదవ్ పకడ్బందీగా వ్యవహరించారు.. తెరవెనుక వ్యూహాత్మకంగా పావులు కదిపారు.. అత్యంత కీలకమైన ఆధారాలు సేకరించారు. పెద్దిరెడ్డిని అనర్హుడిగా చేయాలంటే కావాల్సిన అన్ని రకాల ఆధారాలు సేకరించి, పెద్దిరెడ్డి తప్పించుకునే మరో దారి లేకుండా చేసి, కోర్టులో పిటిషన్ వేశారు. అందుకే ఎన్నికలకు సంబంధించి హైకోర్టులో ఎన్ని పిటిషన్లు దాఖలైన సీరియస్‌గా తీసుకొని హైకోర్టు ఈ పిటిషన్‌లో మాత్రం విషయం ఉండడంతో విచారణకు స్వీకరించి, ప్రతివాదులకు నోటీసులిచ్చి, ఈరోజు ఇంప్లీడ్ కూడా ఆదేశించింది.. 'పెద్దిరెడ్డి అఫడవిట్ క్షుణ్ణంగా పరిశీలిస్తే ఆయన దాచిన ఆస్తులు చాలానే కనిపిస్తాయి. ఎవరూ ఏమి చేయలేరు, ఎవరూ అంత వరకు వెళ్ళలేరు, ఏదైనా చేసేయొచ్చు, ఎవర్నైనా మోసం చేసేయొచ్చు.. అనే ధీమాతో, మదంతో పెద్దిరెడ్డి అక్రమాస్తులను దాచి పెట్టారు.. ఈ పిటిషన్‌లో మొత్తం ఆధారాలు అన్ని ఇచ్చాము, ఆస్తుల లెక్కలు, భూ రికార్డులు, వివరాలు అన్నీ ఇచ్చాము.. ఆ 142 భూ రికార్డులు పెద్దిరెడ్డి, ఆయన భార్య పేరిట ఉన్నవే.. అవేమి ఆయన అఫడవిట్ లో చూపించలేదు.. ఎప్పటికీ అన్యాయాన్ని గెలవనీయను.., అక్రమాలను సహించను, అరాచకాల్ని భరించను" అందుకే పెద్దిరెడ్డిపై అనర్హత వేటు పడినా నేను ఎమ్మెల్యే అవ్వను.. కానీ అక్కడ న్యాయం గెలవడం ముఖ్యం, అక్రమార్కుడు ఓటమి ముఖ్యం, పెద్దిరెడ్డి లాంటి వ్యక్తి ఎమ్మెల్యేగానే కాదు, అసలు రాజకీయాల్లోనే ఉండకూడదు" అందుకే నా పోరాటం అని రామచంద్ర యాదవ్ పేర్కొన్నారు..

మదనపల్లె రికార్డుల దహనంకి, దీనికి లింకు..!

ఈ కేసుని పూర్తిగా పరిశీలిస్తే దీనిలో పేర్కొన్న 142 అక్రమాస్తుల వివరాలు మదనపల్లె సబ్ కలెక్టరేట్ పరిధిలోనే ఉన్నాయి.. కోర్టు విషయాన్నీ సీరియస్‌గా తీసుకోవడం, ఎన్నికల అధికారి కూడా కోర్టుకి వెళ్లి సమాధానం చెప్పుకోవడంతో కేసులో సీరియస్ అంశం, సంచలన అంశం బయటకు వచ్చే అవకాశం కనిపిస్తుంది.. అందుకే ఈ పిటిషన్ దాఖలైనప్పటి నుండి తప్పించుకోవడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తున్న పెద్దిరెడ్డి, చివరికి వేరే దారిలేక, చట్టానికి దొరకకుండా ఉండేందుకు, ఆధారాలు దొరకకుండా ఉండేందుకు మదనపల్లె సబ్ కలక్టరేట్ లోని రికార్డులను తగలబెట్టించారు అనేది అనుమానించాల్సిన విషయమే.. ఈ కేసులో, ఈ లింకులో మొత్తం తలదూర్చి కూపీ లాగితే కొని సంచలన నిజాలు బయటకు వచ్చే అవకాశం కనిపిస్తుంది..

> మాజీ మంత్రి.. వైసీపీ కీలక నేత పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి ఇక ఎమ్మెల్యే పదవి కూడా కోల్పోయే ప్రమాదాల్లో పడ్డారు.. ఎన్నికల అఫడవిట్‌లో ఆయన చూపని ఆస్తులను లెక్కకట్టి.. పక్కా ఆధారాలతో బీసీవైపార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ హైకోర్టులో వేసిన పిటిషన్ విచారణ ఇప్పుడు కీలక దశలో ఉంది.. బుధవారం హైకోర్టులో ఈ కేసు విచారణకు జరిగింది.. ఇరు పక్షాల న్యాయవాదులు సహా, పుంగనూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి కూడా వచ్చారు.. 'పెద్దిరెడ్డి అనర్హుడిగా మారితే.. తర్వాత స్థానంలో ఉన్న చల్లా రామచంద్రారెడ్డి ఎమ్మెల్యే అవుతారు.. ఆయన కూడా ఈ కేసులో ముఖ్యమే, ఆయనను కూడా విచారణలో భాగస్వామి చేస్తూ నోటీసులు ఇవ్వండి, ఇంప్లీడ్ చేయండి' అని హైకోర్టు ఆదేశించింది.. ఇది ఈ కేసులో కీలక పరిణామం..

స్వాతంత్ర్యం అనంతరం, జమీందారీ పాలన కాలానికి చెందిన విలువైన రెవెన్యూ ఆస్తుల రికార్డులున్న పుంగనూరు రికార్డు గది భద్రతపై ప్రజల్లో అనేక అనుమానాలున్నాయి. పూర్వపు తాలూకా కేంద్రమైన పుంగనూరు నుంచే నాటి జమీందారులు పాలన సాగించి అనేక చెరువులు, ఆలయాలు నిర్మించారు. అభివృద్ధి పనులు చేశారు. వారి అధీనంలో వేల ఎకరాల్లో భూములు ఉండేవి. విలువైన భూములు, ఆస్తులకు చెందిన రికార్డులన్నీ రాతిమసీదు వీధిలోని పుంగనూరు తహసీల్దారు కార్యాలయంలోని రికార్డు గదిలో 1948 నుంచి భద్రపరిచారు. రెవెన్యూ రికార్డులు ఎఫ్ఎల్ఆర్ (ఫేర్‌ల్యాండ్ రికార్డు), ఎస్ఎల్ఆర్ (సెటిల్‌మెంట్ ల్యాండ్ రికార్డు), ఇళ్లస్థలాలు, వ్యవసాయ పొలాలు, పొరంబోకు, సెటిల్‌మెంట్ భూములు, అడవులు, దేవదాయశాఖ, వక్ఫ్‌బోర్డు, శోత్రియం భూములు, కీ రిజిస్టర్లు, భూసేకరణ, చెరువులు, వంకలు, కుంటలు, తదితర ముఖ్యమైన విలువైన రికార్డులు భద్రపరిచారు. జమీందారీ పాలనకు సంబంధించిన ప్రాంతాలకు చెందిన భూముల వివరాలన్నీ అందులోనే ఉన్నాయి. గతంలో గ్రామసేవకులు (వీఆర్ఏ) తహసీల్దార్ కార్యాలయాల్లో రాత్రి డ్యూటీలు చేసేవారు. ఈ కార్యాలయానికి కాపలాగా ఉండేవారు. కొంతకాలంగా వీఆర్ఏలు ఆ పనులు చేయడం లేదు. పుంగనూరులో గతంలో రాతిమసీదు వీధిలో పూర్వం నుంచి సొంత భవనంలో తహసీల్దారు కార్యాలయం నడుస్తుండేది. కానీ అధికారుల నిర్లక్ష్యం, అవగాహన రాహిత్యం వల్ల తహసీల్దార్ కార్యాలయంలో ప్రధానమైన రికార్డు గదిని నిర్మించలేదు. దీంతో పాత కార్యాలయంలోనే విలువైన రికార్డులు అక్కడే ఉండగా, కొత్త భవనంలో తహసీల్దార్ కార్యాలయం నడుస్తోంది. ఏ ముఖ్యమైన రికార్డు కావాలన్నా పాత కార్యాలయానికి వెళ్లాల్సివస్తోంది.

పుంగనూరు రికార్డు గది సెక్యూరిటీ

మదనపల్లె ఘటన తరువాత పుంగనూరు పాత తహశీల్దార్ కార్యాలయంలో ఉన్న రికార్డు గదికి ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు. గతంలో తహశీల్దార్ కార్యాలయం రాతి మసీదులో ఉండగా నూతన ఎంపీడీవో కార్యాలయం నిర్మించిన తర్వాత దానిపైకి తహశీల్దార్ కార్యాలయాన్ని మార్చడం జరిగింది. తాజాగా మదనపల్లె సబ్‌కలెక్టరు కార్యాలయంలో ఆదివారం రాత్రి మంటలు చెలరేగి.. కీలకమైన రికార్డులు కాలిపోయాయి.. ఈ ఘటనను సోమవారం పరిశీలించిన డీజీపీ ద్వారకా తిరుమలరావు ఇది ప్రమాదం కాదని స్పష్టం చేశారు. ఎవరో ఉద్దేశపూర్వకంగా కాల్చేశారని, దీని వెనుక పెద్దకుట్ర ఉన్నట్లు అర్థమవుతుంది. ఈ క్రమంలో పుంగనూరులో రికార్డుల భద్రత అంశం తెరపైకి వచ్చింది.

తలుపులు పాడై..

విలువైన రికార్డులున్న గదికి రాత్రి, పగలు కాపలా ఏర్పాటు చేయలేదు. ప్రధాన గేటు వద్ద వరండా గదికి ఉన్న ఓ తలుపు కొయ్యలు పాడైపోయి ఉంది. రికార్డు గది వెనుక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా తలుపులు అధ్వాన్నంగా ఉన్నాయి. భద్రతలేకుండా దిక్కులేకుండా ఉన్న గదిలోని రికార్డులపై ప్రజల్లో అనేక అనుమానాలుకు తావిస్తుంది. గతంలో కొంతమంది అధికారులు పుంగనూరు, మరికొన్ని ప్రాంతాలకు చెందిన ముఖ్యమైన రికార్డులు మాయం చేయడం, మరికొన్ని రికార్డులు చింపివేయడం, రాజకీయ నేతల ఆదేశాలతో తప్పులు చేసినట్లు ఆరోపణలున్నాయి. పుంగనూరు పేరు రాష్ట్రంలో సంచలనాల రేపుతుండడంతో స్థానికంగా రెవెన్యూ అధికారులు మేల్కొని జిల్లాస్థాయి అధికారుల సూచనలతో రికార్డు గదికి నిఘాని ఏర్పాటు చేశారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు నూతన కార్యాలయంలో రికార్డుల నిల్వకు భద్రతాపరమైన ఏర్పాట్లుతో గది నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కృషి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

రైతులతో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ గురించి మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - రామకుప్పం: రైతు సహకార సంస్థకు టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, కుప్పం కడ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని చెల్దిగానిపల్లి గ్రామంలో టిడిపి నేతలతో కలిసి స్థలపరిశీలన చేశారు. అభ్యుదయ రైతులతో టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌పై చర్చించారు. రూ.8.42 కోట్లతో ప్రభుత్వం టమోటా రైతుల సౌకర్యం కొరకు ఆర్థిక సాయంతో నిర్మించనున్నామన్నారు. సహకార సంస్థ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల నిబద్ధతతో నిర్వహించి రైతులకు మేలు జరుగుతుందన్నారు. రైతు సభ్యులే వర్కర్లతో నిర్మించుకొని త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. నిర్మాణాలను పర్యవేక్షించేందుకు కడ అధికారితో పాటు, అదనంగా ప్రత్యేక ఇంజనీర్లను నియమిస్తామన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారి మధుసూదన్ రెడ్డి, ఏడీ కోటేశ్వరరావు, ఆర్డీవో శ్రీనివాసులు, మండల అధ్యక్షులు ఆనంద రెడ్డి, మునస్వామి, సీతాపతి, నారాయణ చారి, రామ్మూర్తి, చిన్నికృష్ణ, చలపతి, విశ్వనాథ్, వెంకటరమణ, సత్తి, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

ద్రావిడ వర్శిటీ కొత్త వెబ్‌సైట్ ప్రారంభం

ప్రజాశక్తి- గుడిపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయం కొత్త వెబ్‌సైట్‌ను గౌరవనీయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎమ్.దొరస్వామి నాయుడు బుధవారం ప్రారంభించారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఇది గొప్ప ముందడుగు, ఈ విశ్వవిద్యాలయం అభివృద్ధిలో కొత్త శకంలోకి అడుగుపెడుతోందని, ఇప్పుడు విశ్వవిద్యాలయం ప్రపంచవ్యాప్త దృష్టిని సాధిస్తుందని ఆయన తెలియజేశారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈ డైనమిక్ వెబ్‌సైట్ విద్యార్థులకు, పరిశోధకులకు ఉపయోగపడుతుందన్నారు. ఎన్ఏఏసీ కోసం ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుతుందని తెలిపారు. ఈ ఘనత సాధించిన వెబ్‌సైట్ అధికారి డాక్టర్ ఎస్.రాజేశ్వర్ రెడ్డిని అధికారులు అభినందించారు. వెబ్‌సైట్ అధికారి డా.రాజేశ్వర్ రెడ్డి కొత్త వెబ్‌సైట్ ముఖ్య లక్షణాల గురించి వివరించారు. ఇది స్నేహపూర్వక వెబ్‌సైట్ విశ్వవిద్యాలయం గురించి మొత్తం డేటాను అందిస్తుందని చెప్పారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వివిధ డిపార్ట్‌మెంట్ల డీన్‌లు, హెడ్‌లు పాల్గొని కొత్త వెబ్‌సైట్ పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

ప్రతి ఫిర్యాదును పరిష్కరించాలి : కమిషనర్

అర్జీలపై సంబంధిత సిబ్బందితో సమీక్షిస్తున్న నగర కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), కలెక్టరేట్ ద్వారా అందే ఫిర్యాదులు, డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో అందే ఫిర్యాదులు, ఇతర వినతులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలని కమిషనర్ డాక్టర్ జె.అరుణ నగరపాలక అధికారులను ఆదేశించారు. బుధవారం నగరపాలక కార్యాలయంలో పీజీఆర్ఎస్, డయల్ యువర్ ఎమ్మెల్యే, కలెక్టరేట్ ఫిర్యాదులు, ఇతరత్రా వినతులను పరిష్కరిస్తున్న తీరు, ఎండార్స్మెంట్, రిపోర్టింగ్ విధానంపై సంబంధిత విభాగాల అధికారులు, వార్డు కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఫిర్యాదులను 24 గంటల్లో క్షేత్రస్థాయి విచారణ పూర్తిచేయాలని, సంబంధిత వార్డు కార్యదర్శులతో పాటు సంబంధిత అధికారులు అర్జీదారులను కలిసి సమస్యపై చర్చించి పరిష్కరించాలన్నారు. ప్రతి సమస్యకు సంబంధించి క్షేత్రవిచారణ, పరిష్కరించిన తీరు, అర్జీదారుని ఫీడ్‌బ్యాక్ తప్పనిసరిగా సమర్పించాలన్నారు. ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, మెప్మా శాఖలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులు, పరిష్కరించిన తీరును, రిపోర్టులను పరిశీలించారు. ఎండార్స్మెంట్, రిపోర్టింగ్ విధానంపై పలు సూచనలు చేశారు. పరిష్కరించదగిన సమస్యలను కచ్చితంగా పరిష్కరించాలని, లేని వాటిని సరైన కారణాలతో అర్జీదారునికి తెలియపరచాలన్నారు. ప్రజాసమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ విషయంలో ఎక్కడా జాప్యం జరగరాదన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఎంహెచ్వో డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, ఎంఈ గోమతి, ఇతర అధికారులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో 'శిక్షా సప్తాహ్'

- వారం రోజులు అవగాహన కార్యక్రమాలు

వేదురుకుప్పంలో

ప్రజాశక్తి- పూతలపట్టు

కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యావిధానం.. 2020 ప్రవేశపెట్టి నాలుగేళ్లవుతోంది. నాలుగో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు వారం రోజులు అన్ని పాఠశాలల్లో 'శిక్షా సప్తాహ్' పేరిట కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా ఏ రోజున ఏ కార్యక్రమాలు నిర్వహించాలో మార్గదర్శకాలు విడుదల చేశారు. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. నూతన విద్యావిధానం పర్యావరణ పరిరక్షణ శారీరక పౌష్టికత, ఆవశ్యకత, ఉపాధి కల్పన నైపుణ్యం, ఇలా వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు రూపకల్పన చేశారు.

పునాది అభ్యసన

23న పునాది అభ్యసన కార్యక్రమం చేపట్టాలి. ఒకటి నుంచి భాషపై పట్టు సాధించేందుకు ఈ పునాది అభ్యసనం చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సంఖ్యాశాస్త్రం, నైపుణ్యం అభివృద్ధి, కార్యక్రమం లాంటివి విజయవంతంగా అమలు చేయడానికి సమాజ భాగస్వామ్యులతో చర్చ కార్యక్రమాలు నిర్వహించి వారికి అవగాహన కల్పించేందుకు కృషి చేయాలి.

బోధన సామగ్రి ప్రదర్శన

ఈనెల 22న బోధన సామగ్రి ప్రదర్శన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఉపాధ్యాయులు స్థానిక వనరులతో బోధన అభ్యాసనా సామగ్రి తయారు చేసే ప్రదర్శించారు. ఇందులో పిల్లల తల్లిదండ్రులను భాగస్వామ్యులను చేసి పాఠశాలల విద్యావిధానంపై అవగాహన కల్పించారు.

క్రీడలకు ప్రాధాన్యం

24న అన్ని పాఠశాలల్లో క్రీడాదినోత్సవం నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులతో వివిధ క్రీడల పోటీలు నిర్వహించి వారి ప్రతిభ వెలికి తీసే ప్రయత్నం చేశారు. శారీరక సౌష్టవం ప్రాముఖ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. ఉపాధ్యాయులు విద్యార్థులు కలిసికట్టుగా క్రీడల పోటీల్లో తారతమ్యాలు మరిచి పాల్గొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రీడలపై మక్కువ చూపించే విధంగా చర్యలు తీసుకున్నారు.

సామాజిక భాగస్వామ్య దినోత్సవం

ఈనెల 28న విద్యార్థుల సామాజిక భావోద్వేగా శ్రేయస్సు కోసం స్థానిక ప్రజలు తల్లిదండ్రుల కమిటీలు ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించి నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలి. విద్యార్థులతో కలిసి కార్యక్రమానికి హాజరైన వారందరూ సహబంతి భోజనాలు చేయాలి.

సాంస్కృతిక వేడుకలు

25న సాంస్కృతిక దినోత్సవంలో భాగంగా విద్యార్థుల్లో భిన్నత్వంలో ఏకత్వం భావాన్ని పెంపొందించడానికి ప్రత్యేక సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలి. నృత్య నాటక ప్రదర్శన గీతాలాపన, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు ఇలా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలి.

సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం

26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవంలో భాగంగా ప్రస్తుతం ఉద్యోగావకాశాల నేపథ్యంలో తరగతి గది అనుభవాలను మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలి. డిజిటల్ కార్యక్రమాలకు అవసరమయ్యే నూతన నైపుణ్యాల అవసరాన్ని గుర్తించడం నైపుణ్య విద్య సమర్థమైన పోటీతత్వాన్ని పెంపొందించే కార్యక్రమాల నిర్వహణ, సాంకేతికత ఆవశ్యకత వివరించాలి.

పర్యావరణ పరిరక్షణ సంకల్పయాత్ర

27న పర్యావరణ పరిరక్షణ సంకల్పయాత్ర పేరిట పాఠశాలల్లో ఎకో క్లబ్ ఏర్పాటు చేయడం విద్యార్థులు వారి తల్లులు మాతృభూమి మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి తల్లులతో కలిసి మొక్కలు నాటించాలి. అమ్మకి అంకితం కార్యక్రమం కింద కనీసం 35 మొక్కలు తల్లి బిడ్డలతో కలిసి నాటించేలా ఉపాధ్యాయులు చొరవచో తీసుకోవాలి. పోషణ దినోత్సవం నిర్వహించి పోషకాహార ఆవశ్యకత విద్యార్థులకు తెలియజేయాలి.

విజయవంతం చేస్తున్నాం..

-దేవరాజులు, జిల్లా విద్యాశాఖ అధికారి

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించి శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం. అన్ని పాఠశాలల హెచ్ఎంలకు ప్రభుత్వ విడుదల చేసిన మార్గదర్శకలను పంపించడం జరిగింది. ఈ ప్రకారమే కార్యక్రమాలు నిర్వహించేలా డివైఈవోలు, ఎంఈవోలు పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేశాం. విద్యార్థులు తల్లిదండ్రులు గ్రామస్తులు అందరూ భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేస్తున్నాం. జిల్లాలోని 2486 ప్రభుత్వ బడుల్లో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

పలమనేరు: ప్రభుత్వం ఆదేశాల మేరకు శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని వారంరోజులు పాటు నిర్వహించన్నుట్లు మండల విద్యాశాఖ అధికారి పి.లీలారాణి, సి.బాలసుందరం తెలిపారు. బుధవారం జెడ్‌హెచ్ఎస్ దొడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్పోర్ట్స్‌డే సందర్భంగా విద్యార్థులకు అన్ని రకాల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నేతాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ద్వారా ఎన్ఇపి లోగో ఆవిష్కరించినట్లు బుధవారం ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. ఈకార్యక్రమం పిల్లల్లో ఉత్సాహాన్ని నింపుతున్నామని తద్వారా పిల్లలలో విద్యావికాసానికి తోడ్పాటు అవుతుందన్నారు.

కుప్పం అభివృద్ధికి రూ.250 కోట్లు

- ప్రత్యేక మ్యానిఫెస్టోను చంద్రబాబు తప్పక అమలు చేస్తారు: నారా భువనేశ్వరి
- 'వైసీపీ నాయకులను టిడిపిలో చేర్చుకోవద్దు' టిడిపి నేతల ఆవేదన

ప్రజాశక్తి- కుప్పం టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి కుప్పం నియోజకవర్గంలో రెండవ రోజు పర్యటనలో భాగంగా పట్టణ ప్రజలు అడుగడుగునా అంతులేని అభిమానంతో సాదర స్వాగతం పలికారు. పట్టణ పరిధిలోని కమతమూరు కాలనీలో నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి, పూజలు నిర్వహించి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామ పరిధిలో నూతనంగా టిడిపి జెండా ఆవిష్కరించారు. పిఈఎస్ వైద్యకళాశాల ఆడిటోరియంలో పట్టణంలోని నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. 2024 ఎన్నికల్లో 12వేలు మెజార్టీ వచ్చిందని, 2019లో 10వేల ఓట్లు మాత్రమే మెజార్టీ మాత్రమే వచ్చిందన్నారు. పురపాలక సంఘం పరిధిలో గల 40 డివిజన్లలో మంచి మెజార్టీ వచ్చిన ఒక డివిజన్‌ను దత్తత తీసుకోవాలని కోరారు. ఎన్నికల సమయంలో వైసీపీ నాయకులు ఓటర్లను అనేక ప్రలోభాలకు గురి చేశారని, అయినా పురపాలక సంఘం నాయకులు కష్టపడి ప్రతి ఓటును జాగ్రత్తగా కాపాడుకున్నామన్నారు. ఎన్నికలకు ముందు స్థానిక నాయకులను ఇబ్బందులు పెట్టిన వారిని పార్టీలో చేర్చుకుంటున్నట్టు వస్తున్న వార్తలు తమను కలిసి వేసిందన్నారు. దయచేసి అటువంటి వాటిపై అధిష్టానం దృష్టిసారించాలని కోరారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. కష్టాలు ఎదుర్కొన్న పార్టీ కార్యకర్తలకు పార్టీ అన్ని వేళలా అండగా నిలబడుతుందని హామీ ఇచ్చారు. కుప్పం పురపాలక సంఘం అభివృద్ధికి రూ.250కోట్లు చంద్రబాబు మంజూరు చేసినట్టు తెలిపారు. కుప్పం ప్రజలకు ఇచ్చిన ప్రత్యేక మ్యానిఫెస్టోను చంద్రబాబు తప్పకుండా త్వరగా అమలు చేస్తారని హామీ ఇచ్చారు. గతంలో మహిళలు బయటకు రాలేకపోయారని, కానీ 2024 ఎన్నికల సమయంలో ఊహించని రీతిలో మహిళలు రోడ్లపైకి వచ్చి పార్టీ కోసం పనిచేయడం గర్వించదగ్గ విషయమన్నారు. ఇదే స్ఫూర్తిని రానున్న కాలంలో కొనసాగించి పార్టీని, రాష్ట్ర భవిష్యత్తును కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

కుప్పం రూరల్: మండల పరిధిలోని ఎన్.కొత్తపల్లి, నడుమూరు, ఉర్లఓబనపల్లి, గుడ్లనాయనపల్లి గ్రామాలలో సభాసమావేశాలు నిర్వహించారు. ఆయా గ్రామాలలో ప్రజలను ఉద్దేశించి నారా భువనేశ్వరి మాట్లాడారు. ప్రతి గ్రామంలోనూ మహిళలతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు ఆయా గ్రామాలలోని సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై సానుకూలంగా స్పందించిన భువనేశ్వరి ప్రతి సమస్య పరిష్కారానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కృషి చేస్తారని హామీ ఇచ్చారు. నడుమూరు గ్రామంలో ఏర్పాటు చేసిన సంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

బుధవారం ప్రభుత్వ అతిథి ఆధ్యాపకులు నారా భువనేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిశారు. 472 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1072 మంది అతిథి అధ్యాపకులు గత పది సంవత్సరాలుగా కేవలం రూ.10వేల జీతానికి పనిచేస్తున్నామని, ఈ జీతాలు సైతం సమయానికి అందడం లేదని, గత రెండు సంవత్సరాలుగా పూర్తిగా జీతాలు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. దీనిపై అనేకమార్లు ప్రజాప్రతినిధులను కలిసి తమ గోడు విన్నవించుకున్నామని, అయినా ఏ నాయకుడికి తమపై కనికరం కలగలేదంటూ వాపోయారు. విధి నిర్వహణలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను నారా భువనేశ్వరి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి సహకరించాలంటూ విన్నవించుకున్నారు. జిల్లా అధ్యక్షులు కుమార్, ఉపాధ్యక్షులు రజనీకాంత్, బాలకృష్ణ, మురుగేష్, మోహన శివ, సుజాత పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు పనిముట్లు ఇవ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

చిత్తూరు కార్పొరేషన్‌లోని ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై బుధవారం మున్సిపల్ పార్క్‌లో సమావేశం జరిగింది. ఈసమావేశంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు, ప్రధాన కార్యదర్శి విజయకుమార్ నాయకులు నాగరాజు మాట్లాడారు. చిత్తూరు కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రొబెషన్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, ఇంక్రిమెంట్లు అమలు చేయలేదని, ఇప్పటికే అధికారులకు విన్నవించినా ఎందుకు ఆలస్యం అవుతుందో అర్థం కాలేదని, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. చిత్తూరు కార్పొరేషన్‌లోని మున్సిపల్ క్వార్టర్స్ మూడు శిథిలావస్థకు చేరుకున్నాయని, వర్షాలు పడితే ఉరుస్తున్నాయని, క్వార్టర్స్ ఆధునికరించి వారి పేర్లతో రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. గతంలో లాగా మున్సిపల్ ఉద్యోగులకు ఆప్కో నుండి కాటన్ చీరలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు గత రెండు సంవత్సరాలుగా ఇవ్వాల్సిన చీరలు, చీపుర్లు, నూనె, చెప్పులు పరికరాలు వెంటనే మంజూరు చేయాలని కోరారు. పదేపదే అడుగుతున్న ఇవ్వకపోవడం ఏమిటి అని ప్రశ్నించారు. చనిపోతున్న కార్మికుల ఉద్యోగుల ప్లేస్‌లో కొత్తవారిని నియమించుకోవడం వల్ల పని భారం ఎక్కువైందని పని భారం తగ్గించాలని కోరారు. కార్పొరేషన్ ప్రజల ఆరోగ్యాలను కాపాడే కార్మిక ఉద్యోగుల పట్ల వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పోరాట సాధించుకున్న సంక్రాంతి కానుక 1000 రూపాయలు ఇవ్వాలని, కార్పొరేషన్ విస్తీర్ణం బట్టి సంఖ్యను పెంచి కార్మికులపై పనిభారం తగ్గించాలన్నారు.

ఇలాగైతే రోగాలు రావా..?

- గ్రామంలో పడకేసిన పారిశుధ్యం
- పూడిపోయిన కాలువలు
- మురుగు నిల్వలతో దుర్గంధం
- పగలు మాత్రమే వెలుగుతున్న లైట్లు
- కన్నెత్తి చూడని అధికారులు

ప్రజాశక్తి- విజయపురం: మండలంలోని కలియంబాకం గ్రామంలో పారిశుధ్యం పడకేసింది. గత రెండు వారాలుగా మండలంలో పారిశుధ్య పనులు జోరుగా సాగుతున్నాయని అధికారులు చెబుతున్నా... ఆ పని కలియంబాకం గ్రామంలో మాత్రం ఎక్కడా కనిపించలేదు. కలియంబాకం గ్రామంలో ఎక్కడ చూసినా మురికి కూపంగా తయారైంది.. కాలువలు వ్యర్థాలతో పూడిపోయి మురుగు నిల్వ చేరి దుర్వాస వస్తోంది.. దీన్ని బట్టి చూస్తుంటే అసలు ఈ పంచాయతీలో పారిశుధ్య పనులు జరుగుతున్నాయి లేదా..? సందేహం ప్రతి ఒక్కరికి కలుగుతుంది. అధికారులు కేవలం ప్రచారానికి మాత్రమే పారిశుధ్య పనులు జరిగినట్లు చెప్పుకుంటున్నారు.. తప్ప.. పారిశుధ్య పనులు జరిగినట్లు ఎక్కడా ఆనవాలైనా లేదని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు.

అధికారులున్నారా..? లేరా..?

కలియంబాకం గ్రామంలో సుమారు 200 ఇల్లు ఉన్నాయి. కలియంబాకం, హరిజనవాడ, ఆది ఆంధ్రవాడ మొత్తం సుమారు 2వేల మంది జనాభా ఉన్నారు. అయితే ఈ గ్రామంలో కనీసం పారిశుధ్య పనులు కూడా జరగకపోవడం శోచనీయం. చిన్న దోమకాటు వలన ప్రస్తుతం జ్వరం, జలుబు, దగ్గుతో ప్రజలు బాధపడే అవకాశం ఉందని జిల్లా యంత్రాంగం ప్రచారం చేస్తున్న కలియంబాకం గ్రామంలో మాత్రం అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరించడంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలు కలియంబాకం గ్రామంలో పారిశుధ్యాన్ని చూస్తే అధికారులు ఉన్నారా.. లేరా..? అనే సందేహం ప్రతి ఒక్కరికి కలుగుతుంది.

పూడికతీతకు నోచుకోని కాలువలు

కలియంబాకం గ్రామంలో కాలువలు అధ్వానంగా ఉన్నాయి. మట్టి, వ్యర్థాలు, చెత్తతో పూర్తిగా పూడిపోయాయి. కాలువలు పూడిపోవడంతో మురుగునీరు కదలలేని స్థితి. ఇంతవరకు కాలువలు పూడికలు తీసిన పాపాన పోలేదు. స్థానిక ప్రజలు ఎన్నిసార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

రాత్రిపూట కంటిపై కునుకు లేదు..

కలియంబాకంలో పారిశుద్ధ్యం వలన దోమల వృద్ధి చెంది రాత్రిపూట దోమల వలన కంటిపై కునుకు లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయంలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని వాపోయారు. చేసేది లేక స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దోమ కాటు వలన జ్వరాలు వచ్చే అవకాశం ఉందని అలాంటి సంఘటన జరగకముందే అధికారులు చర్యలు తీసుకొని పారిశుధ్య పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కాలువలో పేరుకుపోయిన మురుగు


పగలు వెలుగుతున్న వీధి లైట్లు

పగలే వెన్నెల దీపాలు..

కలియంబాకంలో వీధిలైట్లు రాత్రిపూట వెలగడం లేదు.. పగటిపూట మాత్రమే వెలుగుతున్నాయి. ఇది పూర్తిగా అధికారుల నిర్లక్ష్యమే అని స్థానికులు చెబుతున్నారు. రాత్రిపూట లైట్లు లేకపోవడంతో పిల్లలు, పెద్దలు సైతం బయటకు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. అసలే వర్షాకాలం విష సర్పాల సంచరిస్తూ ఉంటాయి. రాత్రి సమయంలో మహిళలు, పిల్లలు బయట రావడానికి భయపడుతున్నారు. అత్యవసర పరిస్థితిలో టార్చ్ లైట్ వేసుకుని బయట రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

గేట్ వాల్ లీకేజీ..

ఓవర్ ట్యాంక్ నుంచి గ్రామానికి సరఫరా చేసే పైపులైన్ మధ్యలో గేట్ వాల్ ఉంది. ఇది మరమ్మతుకు గురికావడంతో అధికారులు దాన్ని సరిచేయకపోవడంతో వృథాగా పోతున్న నీరు గుంటల్లో చేరి పాటిపట్టి దోమలకు నిలయంగా మారింది. తాగునీరు వృథాగా పోతున్నాయని అధికారులకు చెబుతున్నా ఇప్పటికీ తాగునీటి పైపులైన్లు మరమ్మతులు చేయకపోవడంతో నీటి వృథాతోపాటు నీరు గుంటల్లో చేరి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి.

నిధులు ఏమయ్యాయి..?

గ్రామాల్లో పారిశుధ్య పనుల కోసం లక్షల రూపాయలు ప్రభుత్వం కేటాయిస్తోంది. అయితే ఈ నిధులను రూపాయి కూడా ఖర్చు చేసినట్లు ఎక్కడా కనిపించలేదు. అసలు కలియంబాకంలో పారిశుధ్య నిధులు ఏమయ్యాయని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి అధికారులు ప్రశ్నించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాగునీటి పైపులైన్ల వద్ద పరిస్థితి

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

డిఎం అండ్ హెచ్ఓ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ ప్రభావతి దేవి చిత్తూరు నగర పరిధిలోని పలు ప్రైవేట్ హాస్పిటల్స్, క్లినిక్‌లను తనిఖీ చేశారు. సుందరయ్యవీధి, మున్సిపల్ ఆఫీసు ఏరియాలోని అశోక్ డెంటల్ క్లినిక్, డాక్టర్ అరుణ్ మల్టీ స్పెషాలిటీ లేజర్ హాస్పిటల్, సహన మల్టీస్పెషల్టి హాస్పిటల్, శ్రీచైతన్య క్లినిక్, యోషిత పాలి క్లినిక్‌లను తనిఖీ చేసి రిజిస్ట్రేషన్, రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రైవేట్ డాక్టర్స్ అందరూ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ ఉన్నవారు మాత్రమే ప్రాక్టీస్ చేయాలని, అలా లేనిపక్షంలో హాస్పిటల్స్ సీజ్ చేసి శిక్షకు గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. దాదాపు 10 హాస్పిటల్ వారు రిజిస్ట్రేషన్ లేకుండా ప్రాక్టీస్ చేస్తున్నట్లు గుర్తించడం జరిగిందని తెలిపారు. ప్రైవేట్ హాస్పిటల్స్, క్లినిక్లు తప్పనిసరి రిజిస్ట్రేషన్ ఉండాలని, డేట్ ఎక్స్పైర్ అయ్యి ఉంటే రెన్యువల్ చేయించుకోవాలని లేనిపక్షంలో హాస్పిటల్స్‌ను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ నామ్స్ ప్రకారం ప్రజలకు వైద్యసేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఐఓ డాక్టర్ అనిల్ పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి పంపిణీ చేపడుతున్నట్టు ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు సంజీవి తెలిపారు. బుధవారం మండలంలోని మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తవణంపల్లి మండలం పొన్నెడుపల్లి చెందిన యాగమూర్తి మందడి కుమారుడు రాజ్‌కుమార్ పేరిట కొత్తకోట రాజ్ కుమార్ యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ సేవా సంస్థను ఏర్పాటుచేసి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 3,4,5 తరగతుల విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేశారు. కుటుంబ సభ్యులు భూమిక, ఢిల్లీ రాణి, ఉపాధ్యాయులు అరుణ్‌కుమార్, భారతి, తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం పంపిణీ

కుప్పం రూరల్ : పాలెం గ్రామానికి చేరుకున్న నారా భువనేశ్వరి ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులందరూ మంచి విద్యను అభ్యసించి ఉత్తమ భావిభారత పౌరులుగా ఎదగాలని సూచించారు. అనంతరం ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంచిపెట్టారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

గంగాధర నెల్లూరు: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు 1981- 82 విద్యా సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు ఇంటర్ బాలికలకు స్టడీ మెటీరియల్ బుధవారం పంపిణీ చేశారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహాయ కార్యక్రమాలు అందజేస్తామని పూర్వవిద్యార్థులు ప్రభాకర్ రెడ్డి, లోకనాథరెడ్డి, మధుసూదన్, వాసు, రోశయ్య, చంద్ర జయచంద్ర నాయుడు తెలిపారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్‌లో భాగంగా జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రధాన ఉపాధ్యాయురాలు గౌహర్ సుల్తానా అధ్యక్షతన విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ దయానందం కుష్టు వ్యాధిపై, ఆరోగ్యం పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. కుష్టు వ్యాధి మైక్రో బాక్టీరియం లెప్రే అనే బ్యాక్టీరియా వలన వస్తుందని, ఇది గాలి ద్వారా వ్యాప్తి చెందుతుందని అనుమానం ఉంటే వైద్యాధికారి సంప్రదిస్తే నిర్ధారణ చేయించుకోవాలని తెలిపారు. హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రి మాట్లాడుతూ విష జర్వాల నివారణకు దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, ఫ్రైడే డ్రైడే పాటించాలనా వివరించారు.

'108'లో ప్రసవం

తల్లీబిడ్డ క్షేమం

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: 108 వాహనంలో గర్భిణి మగ బిడ్డకు బుధవారం జన్మనిచ్చింది. వివరాలు కెళ్శితే.. మహాదేవ మంగళం గ్రామానికి చెందిన హరితకు ప్రసవం నొప్పులు రావడంతో 108కు కాల్ చేశారు. పాలసముద్రం 108 సిబ్బంది వెంటనే స్పందించి అక్కడికి చేరుకొని ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు ఎక్కువ కావడంతో వాహన ఈఎంటి ప్రశాంత్, పీఎం మురుగయ్య, ఏఎన్ఎం అరుణ వాహనంలోనే వైద్యం అందించి సుఖప్రసవం చేశారు. దీంతో తల్లీబిడ్డ క్షేమంగా బయటపడ్డారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని తూగుండ్రం పిహెచ్సి డాక్టర్లు దివ్య, మౌనిక తెలిపారు.

సామూహిక అక్షరాభ్యాసం

ప్రజాశక్తి- పెద్దపంజాణి: మండలంలోని బణకందొడ్డి గ్రామంలో విశ్రాంత ఉపాధ్యాయులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక శివాలయంలో బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల పరిధిలోని గ్రామాలైన బట్టందొడ్డి, దాసార్లపల్లి, రామాపురం, ముత్తుకూరు కరసనపల్లి, కమ్మినాయనపల్లి ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతిలో చేరిన 100 మంది విద్యార్థులకు ఉచితంగా ఒక జత యూనిఫామ్, విద్యా సామాగ్రి వితరణ చేశారు.

27 వరకు శిశు ఆధార్ క్యాంప్

ప్రజాశక్తి- సదుం : మండల పరిధిలో 5 సంవత్సరాల లోపు పిల్లలకు ఈ నెల 27వ తేదీ వరకు ఆయా సచివాలయ కేంద్రాలలో ఆధార్ కార్డులు తీయనున్నట్లు ఎంపిడిఓ రాజశేఖర్ బాబు బుధవారం ఓప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని పిల్లలు తల్లిదండ్రులు ఉపయోగించు కోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ద్విచక్ర వాహనాల వేలం

ప్రజాశక్తి-పెద్దపంజాణి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం కేసులలో పట్టుబడిన నాలుగు ద్విచక్ర వాహనాలును వేలం వేస్తున్నట్లు బుధవారం ఎస్సై సహదేవి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 26వ తేదీ శుక్రవారం 11 గంటలకు చిత్తూరు ఏఈఎస్ వారి ఆద్వర్యంలో వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు రూ.2వేలు డిపాజిట్ కట్టి వేలంలో పాల్గొనాలని తెలిపారు.

ఆధార్ సర్వీస్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని పెరుమాళ్ళపల్లి సచివాలయంలో ఆధార్ సర్వీస్ సెంటర్ ప్రారంభమైంది. బుధవారం స్థానిక సర్పంచ్ శశి ఆనందరెడ్డి ఆధార్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించి అనంతరం మాట్లాడారు. సచివాలయ పరిధిలోని పంచాయతీలు, ఇతర పంచాయతీల ప్రజలు అందరు కూడా వచ్చి ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టిడిపి నాయకుల పాదయాత్ర

ప్రజాశక్తి- పెద్దపంజాణి: పలమనేరు నియోజకవర్గంలో అమరనాథ్ రెడ్డి విజయం సాధిస్తే కురుడమలై శ్రీమహాగణపతి స్వామివారికి మొక్కులు తీర్చుకొనేందుకు పాదయాత్రగా వెళుతున్నట్లు టిడిపి నాయకుడు భానుప్రతాప్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని రాజుపల్లి గ్రామపంచాయతీ కమ్మినాయనిపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానుల కురుడమలై వరకు పాదయాత్రకు వెళ్లారు. పాదయాత్రలో కృష్ణారెడ్డి, ప్రవీణ్ కుమార్, గణేష్, మునీంద్ర, జగదీష్, ఆది, గోపి, రామకృష్ణ, సుబ్రహ్మణ్యం, నారాయణప్ప, అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

'జగన్ డ్రామాలను ప్రజల నమ్మరు'

చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రజలను పక్కదోవ పట్టించేందుకే మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఢిల్లీలో ధర్నాలు చేస్తూ నాటకాలకు తెరతీసారని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద రావు అన్నారు. ఆయన డ్రామాలను ప్రజలు నమ్మరని చెప్పారు. ఏపీలో శాంతి భద్రతలు నశించాయంటూ బుధవారం దేశ రాజధాని ఢిల్లీ కేంద్రంగా జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన ధర్నా చేయడాన్ని తప్పుపట్టారు. ఢిల్లీ అశోక రోడ్లోని క్వార్టర్ నెంబర్ 50లో జరిగిన విలేకరుల సమావేశంలో చిత్తూరు ఎంపీ, సహచర పార్లమెంటు సభ్యులతో కలిసి మీడియాతో మాట్లాడారు. వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డికి రాజ్యాంగంతో పాటు ప్రజాస్వామ్య విలువలపై గౌరవం లేదన్నారు. అందువల్లే ఆయన ముఖ్యమంత్రిగా పనిచేసిన ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో లేవన్న విషయాన్ని జగన్ గుర్తించాలన్నారు. ఆయన నియంత్రత్వ పోకడలవల్లే.. పేద ప్రజలు ఎన్నో కష్టాలు చవిచూశారని గుర్తు చేశారు. ఇప్పుడు ఢిల్లీలో నిరసనకు దిగి ఆంధ్రప్రదేశ్లో ప్రజలకు భద్రత లేదంటూ ఆరోపణ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్ ముఖ్యమంత్రి హోదాలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం అప్పట్లో ఢిల్లీ కేంద్రంగా ధర్నాలు చేసి ఉంటే బాగుండుందేమోనని అన్నారు. న్యాయపరమైన కేసుల కోసమే ఢిల్లీ పర్యటనలన్నీ రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజాప్రయోజనాల కోసం ఏనాడు కేంద్ర పెద్దలతో చర్చించేవారు కాదని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణెదల పవన్ కళ్యాణ్ ఏపీ అభివృద్ధికి సంబంధించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని ముందుకు సాగుతుంటే ఓర్వలేని జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష హోదా కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తూ, ఢిల్లీలో ధర్నాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. జగన్ రెడ్డి వల్ల ఆంధ్రప్రదేశ్‌కు ఒరిగేదేమీ లేదన్నారు. ఇకనైనా పులివెందుల ఎమ్మెల్యేగా అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రభుత్వానికి సహకరిస్తే ప్రజలు హర్షిస్తారని సూచించారు.

గురుకుల పాఠశాలలో డీసీఓ తనిఖీలు

- ముద్దకట్టిన అన్నం, నీళ్ల సాంబారు, నాసిరకం క్యారెట్టు
- పరిమాణం తక్కువగా ఉన్న కోడిగుడ్లు గుర్తింపు

ప్రజాశక్తి- శాంతిపురం : మండలం కడపల్లి వద్ద ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను చిత్తూరు జిల్లా డీసీఓ టి.పద్మజ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో ముఖాముఖి చర్చించి సమస్యలను ఓపిగా విని సాధ్యమైనంత తొందరలోనే అన్ని సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. మొత్తం పాఠశాల ప్రాంగణాన్ని గదులను, పాఠశాలలో ఉన్న బోర్డులు, మరుగుదొడ్లను పరిశీలించారు. పాముల బెడద వుందని పిల్లలు ఆమెకు వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేశారు. అలాగే పిల్లలకు ఇంగ్లీష్ బోధించి ఉపాధ్యాయుడు లేదని చెప్పడంతో తాను కూడా ఇంగ్లీష్ టీచర్ అని మీకోసం ప్రతిరోజు జూమ్ సమావేశంలో ఇంగ్లీష్ పాఠాలు చెబుతానని, పిల్లల కష్టనష్టాలు తనకు తెలుసు అని చెప్పడంలో పిల్లలు చప్పట్లతో డిసిఓకు వారి కృతజ్ఞతను తెలిపారు. అనంతరం భోజన శాలను పరీక్షించి ముద్దకట్టిన అన్నం, నీళ్ల సాంబారు, నాణ్యతలేని క్యారెట్టు, పరిమితి తక్కువగా ఉన్న కోడిగుడ్లు గుర్తించి సంబంధిత వారిని హెచ్చరించారు. అలాగే ఆడిటోరియంలో రోడ్లను లైట్లు, ముఖ్యంగా మరుగుదొడ్లను పరిశీలించి అన్ని సమస్యలకు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కార మార్గం చూస్తానని అన్నారు. రామకుప్పం ఇంచార్జ్ ప్రిన్సిపల్, పాఠశాల కమిటీ చైర్మన్, ఎంఎస్పి నాయకులు దేవరాజు మాదిగ, దళిత నాయకుడు బాలచంద్రబాబు పాల్గొన్నారు.

బస్సు కోసం విద్యార్థుల పడిగాపులు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: విద్యార్థుల కోసం కేటాయించిన పలమనేరు వయా లక్కనపల్లి - దాసర్లపల్లి ఆర్‌టిసి బస్సు మూడు గంటలకుపైగా ఆలస్యంగా వస్తుండటంతో అక్కడి విద్యార్థులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల మూడు గంటలపాటు బస్సు ఆలస్యంగా రావడంతో లక్కనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాయంత్రం ఐదు గంటల నుండి రాత్రి 8గంటల వరకు దాసర్లపల్లి బస్సు కోసం పడిగాపులు కాస్తున్నారు. రేటింగ్ పాస్ ఉండటంతో ఛార్జీకి సరిగా డబ్బులు లేక విద్యార్థులు ఆ బస్సు కోసం ఎదురుచూస్తూ ఇబ్బందులు పడుతూ ఆలస్యంగా ఇండ్లకు చేరుకుంటున్నారు. ఇండ్ల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు చీకటి పడుతున్నా తమ పిల్లలు ఇంటికి చేరుకోలేదని భయాందోళనకు గురవుతున్నారు. పలమనేరులో విద్యార్థులు రోజూ బస్సు కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. దీనిపై పలమనేరు బస్టాండ్ కౌంటర్లో విచారణ కోరగా మాకేం తెలుసు అంటూ కుంటిసాకులు చెబుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీనిపైన జిల్లా కలెక్టర్ స్పందించి విద్యార్థుల సౌకర్యార్థం బస్సు టైంకు వెళ్లేలా చూడాలని విద్యార్థి తల్లిదండ్రులు కోరుతున్నారు.

బస్సు కోసం గంటల కొద్ది వేచి ఉన్న విద్యార్థులు

దారి సమస్య పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి- గంగవరం: గంగవరం పంచాయతీలోని మారేడుపల్లె గ్రామానికి ఉన్న దారి సమస్యను పరిష్కరించాలని బుధవారం గ్రామస్తులు మండల రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్ సహనకు వినతిపత్రాన్ని అందించారు. గ్రామం నుంచి గంగవరం మండల కేంద్రంతోపాటు పోలీసు స్టేషన్, కౌండిన్య నది, స్మశానవాటిక, పశువైద్యశాల, తహసీల్దార్ కార్యాలయం, పాఠశాలలకు వెళ్లే ప్రధాన రహదారిని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మూసివేసి ఇబ్బందులు కలిగిస్తున్నాడని తెలిపారు. ఈసమస్యపై గతంలో 2007వ సంవత్సరంలో కూడా తహసీల్దార్, పంచాయతీ సర్పంచ్ దృష్టికి తీసుకుని రాగా అప్పటి అధికారులు, పాలకులు చొరవ తీసుకొని సమస్య పరిష్కారం చేశారని తెలిపారు. అయితే ప్రస్తుతం ఆ దారిలో మళ్లీ అడ్డంగా రాతి స్తంభాలు నాటి రాకపోకలకు అంతరాయం కలిగించాడని దీనిపై గ్రామస్తులు ప్రశ్నించగా అతను దుర్భాషలాడుతూ దౌర్జన్యం చేయబోయాడని ఆరోపించారు. కావున అధికారులు, పాలకులు చొరవ తీసుకుని దారిసమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు.

క్రైం న్యూస్

ప్రాణం తీసిన ఫ్లెక్సీ

ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం

ప్రమాదానికి కారణమైన బర్త్‌డే ఫ్లెక్సీ

బతుకు తెరువు కోసం వచ్చిన తమిళనాడు వాసి ప్రమాదవశాత్తు మరణించిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ 49 కొత్తపల్లిమిట్ట వద్ద చిత్తూరు వైసిపి ఇన్చార్జి ఎంసీ విజయానందరెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఫ్లెక్సీ కట్టడానికి తమిళనాడు రాష్ట్రంలోని రాణిపేట నుంచి పది మందితో ఓ కాంట్రాక్టర్ వచ్చారు. 49 కొత్తపల్లిమిట్టలో ఎంసి విజయానంద రెడ్డి ఫ్లెక్సీ ఏర్పాటుకు పోలీసులు అనుమతించకపోవడంతో కటౌట్‌ను వైసిపి నాయకులు ఏర్పాటు చేసే ప్రయత్నంలో మంగళవారం రాత్రి తమిళనాడు రాష్ట్రానికి చెందిన వేలూరు జిల్లా సత్యమంగళం గ్రామానికి చెందిన అరుణాచలం అలియాస్ అరుణ్ ఫ్లెక్సీ కట్ అవుట్ కడుతుండగా ప్రమాదవశాత్తు జారిపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు హుటాహుటిన చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఆర్ పురం ఎస్సై రాజకుల్లయప్ప సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మృతుడు అరుణ్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన బుధవారం బంగారుపాల్యం మార్కెట్ యార్డ్ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్సై మల్లికార్జున ఇచ్చిన సమాచారం మేరకు.. పలమనేరు మండలం బొమ్మిదొడ్డి చెందిన గోవింద్ రెడ్డి (69) పలమనేరు నుండి బంగారుపాళ్యం మండలం కల్లూరుపల్లి గ్రామంలో వారి కుమార్తె రేణుకను చూసేందుకు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా ఈచర్ వాహనం ఢీకొంది. ఈసంఘటనలో గోవింద్‌రెడ్డికి తీవ్రగాయాలు కాగా బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసే దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఉపాధ్యాయురాలు మృతి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం:

యాదమరి మండలం బుడితిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయురాలు శిరీష అనారోగ్యంతో మరణించారు. ఆమె బంగారుపాళ్యం మండలం టేకుమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ మంగళవారం అస్వస్థతకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె భౌతికకాయాన్ని మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

'డయల్ యువర్ ఎమ్మెల్యే' వాయిదా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆంధ్రప్రదేశ్ శాసనసభ కార్యక్రమాలు జరుగుతున్నందున చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ సమావేశాలకు హాజరవుతున్న దృష్ట్యా ఈ గురువారం జరగాల్సిన 'డయల్ యువర్ ఎమ్మెల్యే' కార్యక్రమం వచ్చే గురువారం జరుగుతుందని కమిషనర్ అరుణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని చిత్తూరు నియోజకవర్గ ప్రజలు గమనించాలని కోరారు.

సొంత నిధులతో సిసి రోడ్డుకు మరమ్మతు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్థానిక గాంధీ రోడ్డు గుంతలు పూడ్చేందుకు వ్యాపారి అమర్నాథ్ తన సొంత డబ్బులతో సామాజిక బాధ్యతగా భావించారు. వర్షాల కారణంగా చిత్తూరు నుండి కాణిపాకం వెళ్లే గాంధీ రోడ్డు మార్గం గుంతలమయమైంది. ప్రయాణికుల ఇబ్బందిని దృష్టిలో ఉంచుకొని అమర్నాథ్ దాదాపు లక్ష రూపాయలకు పైగా ఖర్చు చేసి సిసి రోడ్డు గుంతల గూర్చివేతకు పూనుకున్నారు. వ్యాపారి అమర్నాథ్ సామాజిక స్ఫూర్తిని నగరంలోని పలువురు అభినందించారు.

'రైతులు సబ్సిడీని వినియోగించుకోండి'

ప్రజాశక్తి- శాంతిపురం: జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్ రెడ్డి బుధవరాం క్షేత్రస్థాయి పర్యటన చేశారు. మండలంలోని 121 పెద్దూరు గ్రామపంచాయతీలోని వివిధ రైతుల పొలాలను పరిశీలించారు. బి.నారాయణరెడ్డి సాగు చేస్తున్న బంతిపూల తోటను పరిశీలించి తడి వాతావరణ పరిస్థితులు దృష్ట్యా బంతి పూల తోటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా రైతులకు అందిస్తున్న వివిధ పథకాల గురించి వివరించారు. మల్చింగ్ పేపర్ వేసుకున్న రైతులకు హెక్టర్‌కు రూ.16వేలు, బంతి, చామంతి, కనకాంబరం మొదలైన పూలు తోటలకు హెక్టార్‌కు రూ.16వే లు సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే టిష్యూ కల్చర్ బనానా పంట సాగుకు రెండు సంవత్సరాలు కలిపి హెక్టార్‌కు దాదాపు రూ.41,850 వేలు, తీగ జాతి కూరగాయల సాగుకు రూ.18,750వేలు సబ్సిడీ ఉద్యాన శాఖ ద్వారా అమలు చేయబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారిని డింపు ప్రియాశ్రీ, గ్రామఉద్యాన సహాయకులు మనోజ్ కుమార్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

భువనేశ్వరి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - రామకుప్పం: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ నారా భువనేశ్వరి రామకుప్పం మండల పర్యటనకు టిడిపి నేతలు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం మండలంలోని ఆవులకుప్పం, నారాయణపురం తాండా, ఆరుమానిపెంట, వీర్నమల గ్రామాల్లో పర్యటించనున్న నేపథ్యంలో పసుపుమయంతో సెక్సీలు నెలకొల్పారు. మహిళలతో ముఖాముఖి సభలకు ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నేతలు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేస్తున్నారు.